క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి పూజలు


ఎనుములపల్లిలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పుట్టపర్తిటౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో బీడుపల్లి, ఎనుములపల్లి గ్రామాల్లో మంగళవారం శ్రీభూనీల సమేత లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

బూడిద తెగులుపై అప్రమత్తంగా ఉండండి

ధర్మవరం రూరల్: మామిడి పంటకు సోకే తెగుళ్లను నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి అమరేశ్వరి రైతులకు సూచించారు. ప్రస్తుతం మామిడి చెట్లు పూత, పిందె దశలో ఉన్నాయన్నారు. ఈ సమయంలో బూడిద తెగుళ్లు ఆశించి పంట దిగుబడులపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. బూడిద తెగులు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయెట్ 0.3 గ్రాములు, హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

12న కంటి వైద్య శిబిరం


పోస్టర్లు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఈనెల 12న కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి చికిత్సలు చేస్తారని, దృష్టిలోపం ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి జయసింహ, క్యాంపు చైర్మన్ సత్రసాల ప్రసన్నకుమార్, రమేష్‌బాబు, శివయ్య, జయచంద్ర, హరినాథ్, నాగభూషణం పాల్గొన్నారు.

10న ప్రజావేదిక

కనగానపల్లి: మండలంలో జాతీయ ఉపాధిహామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలపై ఈ నెల 10న ప్రజావేదిక నిర్వహిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఫిబ్రవరి 25 నుంచి మార్చి 9వరకు సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీ నివేదికలను బహిరంగ పరిచేందుకు వచ్చే శుక్రవారం ధర్మవరంలోని ఏపీడీ క్లస్టర్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని గ్రామ సభలు నిర్వహించకుండా నేరుగా ప్రజా వేదికను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

కళాకారుల భవన నిర్మాణానికి కృషి


ఇంజినీర్ మురళీకృష్ణను సన్మానిస్తున్న ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సుబ్బరావుపేటలో జానపద కళాకారుల భవన నిర్మాణానికి అనంతపురానికి చెందిన ఇంజినీర్ మురళీకృష్ణ విరాళం అందిస్తున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఆచార్య డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి తెలిపారు. సుబ్బరావుపేటలో మురళీకృష్ణను మంగళవారం కళాకారులు, చిగిచెర్ల కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లో జరిగే జానపద కళాకారుల సదస్సుకు తరలివెళ్తున్న కళాకారులకు ప్రయాణ ఖర్చుల కోసం మురళీకృష్ణ కొంత మొత్తాన్ని అందజేశారన్నారు.

ధర్మవరం కళాకారిణికి ఉత్తమ సేవా నారీ పురస్కారం


రామలాలిత్యకు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన ధర్మవరం నాట్యాచార్యులు బాబు బాలాజీ, కమలా బాలాజీ కుమార్తె కళాకారిణి రామలాలిత్యకు ఉత్తమ సేవా నారీ పురస్కారం దక్కింది. కళారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు సంస్కార భారతి సంస్థ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దిశ డీఎస్పీ శ్రీనివాస్ రామలాలిత్యకు పురస్కారాన్ని అందజేశారు.

మార్మోగుతున్న గోవింద నామస్మరణ

ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా, అత్యంత వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి ఆలయ ప్రాంగణం స్వామివారి గోవింద నామస్మరణతో మార్మోగిపోతోంది. మంగళవారం శ్రీవారు బ్రహ్మ గరుడసేవలో భాగంగా గరుడవాహనంపై తిరువీధుల్లో విహరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరిస్తున్నాయి.

–కదిరి


అలరిస్తున్న చిన్నారుల నృత్యాలు


గరుడవాహనంపై శ్రీవారి దర్శనం


కేరళ వాయిద్యాలు భలే..భలే


తిరువీధుల్లో భక్తులను ఆకట్టుకుంటున్న నృసింహవేషధారణ


మహిళల కోలాటం

ముంగిటకే సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. కుణుతూరు గ్రామంలో వైస్ ఎంపీపీ పాటిల్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కే.శ్రీనివాసరెడ్డితో కలిసి మంగళవారం ఆయన గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బత్తలపల్లి: ప్రజల నుంచి అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న 25 ప్యాకెట్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష పట్టుకున్నారు. వివరాలు... మండలంలోని యర్రాయపల్లిలో రేషన్ బియ్యం సేకరించి బ్లాక్‌మార్కెట్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం మండల పరిధిలోని యర్రాయపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ ఆటోని నిలిపి తనిఖీలు చేయగా, 25 ప్యాకెట్ల (1,100 కేజీలు) బియ్యం పట్టుబడింది. సంగాల గ్రామానికి చెందిన గుజ్జల శివకుమార్ బియ్యాన్ని ప్రజల నుంచి సేకరించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తేలింది.


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

నిందితుడిని అదుపులోకి తీసుకుని బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి, రామలింగమయ్య, సీఎస్‌డీటీ శారద, వీఆర్‌ఓలు గోవిందరాజులు, సాయిమనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమమే ధ్యేయం

పుట్టపర్తి టౌన్: కాపుల సంక్షేమమే ధ్యేయంగా కాపు సంక్షేమ సేన పనిచేస్తుందని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ గ్రంధి దినకర్ పేర్కొన్నారు. పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో మంగళవారం జరిగిన జిల్లా కాపుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం, రాజ్యాధికారం కోసం కాపులు చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా బొగ్గరం శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు శ్యామ్ కుమార్, గౌరవాధ్యక్షుడు వెంకటనారాయణ, నాయకులు జగదీష్, నరసింహమూర్తి, రామకృష్ణ, బాలగంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు విజయం చేకూర్చండి

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: ఈ నెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. ఎదురుదోన, మేకలచెరువు, ధనియానిచెరువు, పీ కొత్తపల్లి, పెడబల్లి పంచాయతీల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి గ్రామంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులకు తెలియజేసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు లభించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ ఈటిరాము, ఎమ్మెల్సీ ఎన్నికల కో ఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీలు కొత్తరంగారెడ్డి, సరస్వతి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ఆదినారాయణరెడ్డి, సర్పంచులు సరిత, నాగమునీశ్వరనాయుడు, దిల్షాద్, విష్ణుమూర్తి, డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రాఘవయ్య, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, మాజీ


పెడబల్లిలో పార్టీ శ్రేణులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ఎంపీపీ సోమిరెడ్డి, నాయకులు షామీర్‌బాషా, అల్లాభక్షు, హరీష్‌రెడ్డి, కేశవ, సాంబ, రంగారెడ్డి, ప్రకాష్, హరిప్రసాద్‌రెడ్డి, బీసీసెల్ కన్వీనర్ ఆదెప్పనాయుడు, ఉపసర్పంచులు నబీసాబ్, రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కదిరి టౌన్: కదిరి మున్సిపాలిటీ పరిధిలోని 9, 10,11,12 వార్డుల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి , వీసీఎస్ ఆర్‌ఐ విద్యా సంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి మంగళవారం సమావేశం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమష్టిగా పనిచేయాలని, ప్రతి ఇంటికీ వెళ్లి పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయించాలన్నారు.

కోలాహలంగా హోలీ సంబరాలు


రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తున్న శారదానగర్ వార్డు ప్రజలు, తండా వాసులు

ధర్మవరం: వీధి వీధిన రంగుల వాన కురిసింది. ఉత్సాహం ఉరకలెత్తింది. యువతీ యువకులు రంగుల్లో తడిసి నృత్యాలు, కేరింతలతో సందడి చేశారు. హోలీ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం ధర్మవరంలోని శారదానగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు దాసునాయక్, కౌన్సిలర్ లాలేనాయక్ ఆధ్వర్యంలో వార్డు ప్రజలు, తండా వాసులు చిన్నా పెద్ద తేడా లేకుండా వీధుల్లోకి వచ్చి గిరిజన సంప్రదాయం ఉట్టిపడే రీతిలో పరస్పరం రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు.

కదిరి టౌన్: కదిరి పట్టణంలో మంగళవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. పట్టణంలో స్థిరపడిన రాజస్థానీ వాసులు రంగులు చల్లుకుంటూ డ్యాన్స్‌లు చేస్తూ సంతోషంగా గడిపారు. అదే విధంగా కదిరి పౌర్ణమి సందర్భంగా బంజార సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు.

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో, పత్యాపురం, సంగాల తండాల్లో గిరిజనులు హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. రంగు నీళ్ల చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. ఆర్డీటీ ప్రాంగణంలోనూ హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించినందుకు గుర్తుగా ఈ వేడుకలను జరుపుకుంటారన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి గరుడోత్సవం


గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు, డైరెక్టర్ల సమక్షంలో స్వామివారి ఉత్సవమూర్తిని గరుడ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారిని కనులారా దర్శించుకున్నారు. గోదా రంగనాథ మహిళా సంఘం సభ్యులు కోలాటం ఆడుతూ అందరినీ ఆకట్టుకున్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి చేయండి

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కొత్తచెరువుకు చెందిన అబ్దుల్ షాజహాన్(షాన్‌షేట్) మంగళవారం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆయనకు నియామకపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని అబ్దుల్ షాజహాన్‌కు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సూచించారు.

కొత్తచెరువు: శ్రీ సత్యసాయి జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడిగా నియమితులైన కొత్తచెరువు గ్రామానికి చెందిన షాన్‌షేట్‌కు అభినందనలు వెల్లువెత్తాయి.


అబ్దుల్ షాజహాన్ (షాన్‌షేట్)కు నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

మైనార్టీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన్ను కలిసి పూలమాలతో అభినందించారు. వాల్మీకి శంకర్, గిరి, మానేరు ప్రసాద్ పాల్గొన్నారు.

హోరెత్తిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ఓడీ చెరువు: ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కొత్తచెరువు: కేశాపురంలో ఉపాధ్యాయులను ఓట్లు అడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


సిద్దరాంపురంలో పట్ట భద్రులను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ,సర్పంచ్, తదితరులు


కనగానపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

ఓడీ చెరువు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మద్దతుగా వైఎస్సార్ సీపీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషిని వివరిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విన్నవిస్తున్నారు. ఓడి చెరువు ఎంపీపీ ఫర్వీన్‌బాను, పార్టీ కన్వీనర్ రాజు నాయుడు, అగ్రి అడ్వైజరీ బోర్డు మండల చైర్మన్ లక్ష్మిరెడ్డి మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేశారు. రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల బాబా, సర్పంచు గోవిందు, మాజీ సర్పంచు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కొత్తచెరువు: వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా కొడపగానిపల్లి, కేశాపురం, మైలసముద్రం, నారేపల్లిలోని పాఠశాలలు, సచివాలయాలను వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, మటన్ శంకర్, మాజీ సర్పంచ్ శ్యాం సుందర్ రెడ్డి, సర్పంచ్‌లు అలివేలమ్మ, నరేంద్ర రెడ్డి, ప్రకాష్, గిరి, గోపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, రమణారెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో పలు గ్రామాల్లో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ముమ్మరంగా ప్రచారం చేశారు.

కనగానపల్లి: వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాగముని తగరకుంట, ముత్తువకుంట్ల, బద్దలాపురం, తల్లిమడుగుల, యలకుంట్లలో ప్రచారం నిర్వహించారు. అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి, రవి, పాపన్న, అశోక్, అనిల్, అమరనాథరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం



కృష్ణారెడ్డిని, రమణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

నల్లచెరువు: పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్ ఎంపీపీ కె రమణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

తలుపుల: వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన మండలంలోని బురుజుపల్లికి చెందిన తలుపుల ఉప సర్పంచ్ సి.కృష్ణారెడ్డి (డిక్ బాబు) మంగళవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, క్రిష్టారెడ్డి, నాయకులు దివాన్‌వలి, చంద్ర, మౌలా, కుమార్, ప్రభు పాల్గొన్నారు.

నష్టాల భయం లేని మొక్కజొన్న

- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- మండలంలో ఏటేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- గత ఏడాది కంటే ఈ సారి రబీలో 70 శాతం అధికం

ఓడీ చెరువు: మొక్కజొన్నకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుండటంతో చాలా మంది ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా మండలంలో ఈసారి మొక్కజొన్న సాగు భారీగా పెరిగింది. మండల వ్యాప్తంగా రబీలో 10,360 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా 3,100 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయడం విశేషం. గతేడాది 1500 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభం: మిగతా పంటలతో పోల్చితే మొక్కజొన్న సాగుకు పెట్టుబడి ఖర్చు చాలా తక్కువ.


దబురువారిపల్లి వద్ద సాగు చేసిన మొక్కజొన్న పంట

రైతుల శ్రమ కూడా తక్కువే. దీనికి తోడు మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటాల్ రూ. 2200 వరకు ధర పలుకుతోంది. విత్తనం నుంచి కోత వరకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరాకు కనీసం 30 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.

కళకళలాడుతున్న పైర్లు: ఈ ఏడాది మండలంలో మొక్కజొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఆ తర్వాత కూరగాయల పంటలు సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పాటు గతంలో మాదిరిగా తెగుళ్ల బెడద లేకపోవడంతో మొక్కజొన్న పంట కళకళలాడుతోంది.